క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాగనూర్: మరమ్మతుల కారణంగా మండలంలోని నేరడగం సబ్‌స్టేషన్ పరిధిలోని బైరంపల్లి, నేరడగం, నేరడగందొడ్డి, ఉజ్జెల్లి, తళంకేరి, గురువలింగంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దేవేందర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

మరికల్: మండల కేంద్రంలోని 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవికాంత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిమెంట్ బెంచీల వితరణ

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట చెందిన చాకలి రాములు జ్ఞాపకార్థకంగా ఆదివారం కుమార్తెలు రెండు సిమెంట్ బెంచీలను గ్రామానికి అందజేశారు. గ్రామంలో ముఖ్య కూడలిలో గ్రామస్తులు కూర్చొవడానికి వీటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో మక్తల్ అభివృద్ధి

మక్తల్: నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం పట్టణంలో నారాయణపేటకు వెళ్లే రోడ్డుల్లో సిటీ వెంచర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, సూర్యనారాయణ, నీలప్ప, శరత్, పూజశివ, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

నారాయణపేట రూరల్: నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మండలంలోని సింగారం చెందిన బోర్ల పుష్ప, విష్ణువర్ధన్ దంపతుల కుమారుడు ఉదయ్‌శంకర్ ఇటీవల జరిగిన నీట్ పరీక్షలకు హాజరై 720మార్కులకు 550సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని ఆదివారం సాయంత్రం ఆ గ్రామ పెద్దలు స్థానిక జీపీ భవనం దగ్గర శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చింతలయ్య, నర్సింహులు, హన్మంతు, మల్లేష్, కనకప్ప, వెంకటప్ప, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



మద్దూరు: మండల కేంద్రం నుంచి పెదిరిపాడ్ మీదుగా నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువు కట్ట దగ్గర ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ రోడ్డు గతంలో మెటల్‌రోడ్డు ఉండేది. 11ఏళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ నిధులతో ఈ రోడ్డును బీటీగా మార్చారు. నారాయణపేటకు ఈ రూట్లో వెళితే దూరం తగ్గుతుండడంతో ఈ రూట్లో వెళ్లడానికి వాహనచోదకులు మొగ్గుచూపుతున్నారు. బీటీరోడ్డు వేశారు. కానీ ఎక్కడా ప్రమాద సూచికలు పెట్టకపోవడం, స్పీడ్ బ్రేక్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నాళ్ల క్రితం ఒత్తుగుండ్ల చెందిన చాకలి రాములు బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే చెన్నారెడ్డిపల్లికి చెందిన చెంద్రప్ప బైక్ వస్తూ అదుపుతప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏళ్ల క్రితం వేసిన రోడ్డు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు, గుంతలోకి పడిపోకుండా కల్వర్టు వద్ద ఇనుప కడ్డీలు, గుంతలు పడ్డ చోట మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రెయినేజీలు అస్తవ్యస్తం



మక్తల్‌లో ఇళ్ల మధ్యన నిలిచిన మురుగు

- ముస్సిపాలిటీలో లోపించిన పారిశుద్ధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మక్తల్: పట్టణ పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు పారుతుంది. వర్షాకాలంలో మున్సిపాలిటీ పరిధిలోని యల్లమ్మకుంట, కేశవనగర్, అంబేద్కర్‌నగర్, మల్లికార్జున దేవాలయం సమీపాన, నిజామొద్దీన్ దర్గా వద్ద మురుగు ఇళ్ల మధ్యనే ఉంటుంది. స్థానిక మున్సిపాలిటీలో 13 మంది ఉద్యోగులు, 58 మంది కార్మికులు పని చేస్తున్నారు. 16 వార్డులుండగా 22,165 జనాభా ఉంది. 36 మంది ప్రభుత్వ ఉద్యోగులు గాను కేవలం 13 మంది మాత్రమే పని చేస్తున్నారు. పట్టణంలోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో కాలనీ వాసులు ముక్కు మూసుకునే పరిస్థితి ఏర్పడింది. వార్డులకు ప్రత్యేక అధికారులను నియమించినా ఫలితం లేకుండా పోయింది. పల్లెప్రగతిలో పనులు మాత్రం తమకు అవసరం ఉన్న వాటికే మంజూరు చేయించుకుని చేతులు దులుపుకున్నారు. ప్రతి రోజు దాదాపు 15 క్వింటాళ్ల మురుగు, కాగితాలు, చెత్త ట్రాక్టర్లపై తీసుకెళ్లి పట్టణ సమీపంలో కంపచెట్ల వద్ద పడేస్తున్నారు. మున్సిపాలిటీ ఏర్పడి రెండేళ్లు గడిచినా పాలకుల, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన కూడలీల వద్ద ఉన్న చెత్తకుండీలో చెత్త తొలగించకుండా ఉండడంతో పందులు స్వైర విహారం చేస్తున్నారు. అధికారులు వర్షం వస్తే అప్పటి వరకే చూస్తున్నారని సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని స్థానికులు అంటున్నారు.

సమస్య పరిష్కరించండి..



మున్సిపాలిటీలో సమస్యలు అధికంగా ఉన్నాయి. యల్లమ్మకుంట వర్షంలో మునిగిపోతుంది. ఇళ్లలోకి నీళ్ల వస్తున్నాయి. అధికారులు కాలనీలను పరిశీలించాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– నర్సింహులునాయుడు, మక్తల్

చర్యలు తీసుకుంటాం..

మున్సిపాలిటీ పరిధిలోని కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిధులు మంజూరైన వెంటనే విడతల వారీగా పనులు చేపడుతాం.

– భోగేశ్వర్లు, కమిషనర్ , మక్తల్ మున్సిపాలిటీ



పాత బీసీ హాస్టల్ వద్ద రోడ్లపై చెత్త



పట్టణంలో డ్రెయినేజీలో తాగునీటి బోరు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



లక్ష్మీపూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నారాయణపేట రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం లభిస్తుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సర్కారు పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తుందని, నాణ్యమైన భోజనం పెడుతుందన్నారు. 5ఏళ్లు నిండిన చిన్నారులకు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ప్రవేశాలు చేయించారు. కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ వెంకటమ్మ, వీవీఏ సాయిలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేటలో బీజేపీ సంబరాలు



నారాయణపేటలో మోదీ చిత్రపటం ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సత్యనారాయణచౌరస్తాలో ఆదివారం రాత్రి బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. ఢిల్లీలో మూడోసారి మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పటాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. అదేవిధంగా పాదాచారులు, వాహనదారులకు చాయ్ పంపిణీ చేశారు. అంతకుముందు పట్టణంలోని ఓ చిత్రకారుడు గీసిన భారీ మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, రఘువీర్‌యాదవ్, నర్సింహులు, వెంకట్రాములు, శ్రీనివాస్, రమేష్, కృష్ణ, విజయ్, అనంత్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

మరికల్: మాధవరం గ్రామంలో బీజేపీ నాయకులు సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంచా కాల్చారు. మరికల్, పెద్దచింతకుంట, అప్పంపల్లిలో నాయకులు విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్నారు.



మాధవరంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

మక్తల్: పట్టణంలో ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు అంబేద్కర్‌చౌరస్తాలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండయ్య, నరేందర్, శ్రీధర్, రాంమాధవ్, రాజు, రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠరథం ప్రారంభం



నారాయణపేట రూరల్: మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్‌బట్టడ్ సొంత డబ్బులతో పట్టణానికి అందించిన నూతన వైకుంఠరథాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. పట్టణంలో మరణించిన వారిని అంతిమసంస్కారాల కోసం రుద్రభూమికి తీసుకుని వెళ్లడానికి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఉచితంగా దీన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అవసరమైన వారు 9985221859, 9177377329 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జనార్దన్, వెంకటయ్య, రవికుమార్‌గౌడ్, సాయినాథ్, ఆత్మారాం, శ్రీనివాస్, భీంచందర్, అమరేష్, సత్యనారాయణ, సదానంద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుడు మృతి

ఊట్కూరు: అనారోగ్యంతో మిషన్ భగీరథ కార్మికుడు శేఖర్(45) ఆదివారం మృతి చెందాడు. మండల కేంద్రంలోని ఈశ్వర్‌మందిర్ వీధికి చెందిన ఈయన 15 ఏళ్లుగా సత్యసాయి వాటర్ సరఫరా, మిషన్ భగీరథ పథకంలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండగా, వారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

మాజీ సర్పంచ్ మృతి సంతాపం

మాగనూర్: మండలంలోని తళంకేరికి చెందిన మాజీ సర్పంచ్ రామస్వామి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గ్రామం కొత్త పంచాయతీ అవడంతో మొదటి సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న నియోజకవర్గ, మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజుల ఆశిరెడ్డి, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మధుసుదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో 1996–97విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న విద్యార్థులు స్థానిక ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదువుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులను ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, వారి జీవిత విషయాలను చర్చించుకున్నారు. తాము చేస్తున్న ఉద్యోగ, వ్యాపార, రాజకీయ అనుభవాలతో పాటు కుటుంబం, పిల్లల చదువులు, చిన్ననాటి తరగతి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అటెండర్ నర్సింహులును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందచేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాఘవేంద్రచారి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, శశిధర్, నారాయణరెడ్డి, సుధీర్, వెంకటేష్, సుదర్శన్, గంగాధర్, నర్సింహులు, పూర్వ విద్యార్థులు నరేష్, శివచారి, రాజశేఖర్, సంతోష్, పురుషోత్తం, నగేష్ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–02 పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.



మరికల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

అవదూత మఠం కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: పట్టణంలోని సద్గురు అవదూత మఠం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయప్రకాష్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణకల్యాణి, ప్రధాన కార్యదర్శిగా బాలచందర్ నల్వార్, సహ కార్యదర్శిగా కిరణ్ లాంఢ్గె, కోశాధికారిగా అమిత్ కల్యాణ్, 25మంది సభ్యులను ఏర్పాటు చేశారు. గౌరవ సలహా సభ్యులుగా దేవదత్తఢగే, తప్పణ్ణ కల్యాణి, కృష్ణ, అమర్‌నాథ్, సంఘ నర్సింహులను నియమించారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయగా, వారిని సభ్యులు శాలువాతో సన్మానించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మాదిగల కవాతు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కర్రప్ప

నారాయణపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జులై 7న వేలాది మందితో వరంగల్‌లో భారీ ఎత్తున కవాతు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రప్ప తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవనంలో ఎమ్మార్పీఎస్, ఉపకులాల అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కవాతు మాదిగల ఆత్మగౌరవనికి ప్రతీకగా ప్రతి ఒక్కరు చూడాలని, లక్షలాది మంది మాదిగలు హాజరై విజయవంతం చేయాలన్నారు. అలాగే ఎంపీ డీకే అరుణ గెలుపులో ఎమ్మార్పీఎస్, మాదిగల పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. సమావేశంలో గడ్డం కృష్ణయ్య, వెంకటయ్యమాదిగ, వెంకటేష్, ఈదెప్ప, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చేపల వేచి ఉన్న గ్రామస్తులు

చేపల వేటలో మత్స్యకారులు

మండలంలోని కిష్టాపూర్ రామసముద్రం చెరువులో ఆదివారం మత్స్యకారులు చేపలను పట్టారు. ఆదివారం మిరుగ కావడంతో చేపల కోసం గ్రామంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గతేడాది చెరువలో వేసిన చేపలు పెరగక పోవడంతో కేవలం అరకిలో, కిలో వరకు మాత్రమే పెరిగాయని మత్స్యకారులు తెలిపారు.

- ధన్వాడ



చేపలను బయటకు తెస్తున్న మత్స్యసంఘం సభ్యులు



చెరువులో వల వేస్తున్న మత్స్యకారులు

తొలకరి లేతగడ్డితో జీవాలకు నష్టం

మాగనూర్: వర్షాకాలం ప్రారంభంలో తొలకరి లేతగడ్డితో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదముంది. ఈ సీజన్‌లో కురిసే వర్షాలకు పచ్చిగడ్డి పెరుగుతుంది. ఈ గడ్డిని జీవాలు తింటే ఎలాంటి రోగ లక్షణాలు కనిపించకుండానే చిటికె వ్యాధి(ఎంటరోటాక్సీమియా) సోకి చనిపోయే ప్రమాదం ఉంది. గొర్రెల కాపరులకు చిటికె వ్యాధిని ప్రాంతాల వారీగా నెత్తిపిడుగు, గడ్డిరోగం, పాటురోగం పేర్లతో పిలుస్తుంటారు. ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించే జీవాలు సైతం చిటికె వేసినంత సమయంలో ఉన్నఫలంగా చనిపోయే పరిస్థితి నెలకొంటుంది. పశువులకు సోకే చిటికె వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి పశువైద్యులు సలహా, సూచనలు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

క్లోస్టీడియం అనే సూక్ష్మజీవులు గాలిలేని (ఎనిరోబిక్) వాతావరణంలో అభివృద్ధి చెందిన సందర్భంలో వదిలిన విష పదార్థాలు (టాక్సీన్లు) ఈ వ్యాధికి కారణమవుతాయి. తొలకరి వర్షాలకు పెరిగిన లేతగడ్డిని గొర్రెలు ఆశగా తింటాయి. దీంతో పేగుల్లో గాలిలేని వాతావరణంలో ఏర్పడడం ద్వారా సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది వ్యాధిని కలిగిస్తాయి. ఈ వ్యాధి మే చివరి నుంచి జూలై చివరి వరకు ఎక్కువగా కనిపిస్తుంటుంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో కూడా వ్యాపించే అవకాశాలు ఉంటాయి.

వ్యాధి లక్షణాలు..

ఎలాంటి రోగలక్షణాలు కనిపించకుండానే ఉన్నట్లుండి జీవాల మంద చనిపోతుంది. చనిపోయే ముందు గొర్రెలు నీరసంగా ఉండడం గమనించవచ్చు. జీవాలు గాలిలోకి ఎగిరి కింద పడి కాళ్లు గిలగిల కొట్టుకుంటూ పళ్లు కొరుకుతూ, వణుకుతూ, బిగుసుకుపోయి నిమిషాల్లో చనిపోతాయి. కొన్ని జీవాలు నోటి నుంచి నురగ కక్కుతాయి. శ్వాస పీల్చే శాతం ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మలబద్ధకం, కడుపు ఉబ్బరం ఉంటుంది. మేత మేయకుండా, నెమరు వేయకుండా తల వాల్చి, ముడుచుకుని ఒకే చోట నిలబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో కనిపిస్తుంటాయి.



మాగనూర్ సమీపంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు (ఫైల్)

చికిత్స..

జీవాల జీర్ణకోశంలో సూక్ష్మజీవుల వ్యాప్తిని అరికట్టేందుకు టెట్రాసైక్లిన్, ఆంఫీసిలిన్, జెంటామైసిన్ వంటి మందులను క్లోరిల్, ఎపిల్ వంటి ఇంజక్షన్‌లను పశువైద్యుడి పర్యవేక్షణలో వాడాలి. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మేలో వ్యాధి నిరోధక టీకాలలు (మల్టీకాంపోనెట్, ఈటీ వ్యాక్సిన్) వేయించాలి. రెండో విడతగా అక్టోబర్, నవంబర్ మాసాల్లో వేయించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని సాధ్యమైనంత వరకు జీవాలకు వలస ప్రాంతాల్లో గల వ్యాధులను బట్టి ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడం ద్వారా నివారించుకోవచ్చు. జీవాలను ఉదయం కొంచెం ఆలస్యంగా మేతకు తీసుకెళ్లడం, మధ్యాహ్నం విశ్రాంతి ఇవ్వడం, సాయంత్రం త్వరగా ఇంటికి తీసుకురావడం వల్ల జీర్ణాశయంలో ఖాళీ ఏర్పడి సూక్ష్మజీవుల దాడిని తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



వర్షాకాలం ప్రారంభం కావడంతో గొర్రెల కాపరులు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా టీకాలు వేయించడంతో పాటు పశువైద్యుల సూచనలు, సలహాలు పాటించడం మంచిది. ఎక్కువ శాతం తొలకరి లేత గడ్డి మూగజీవాలు తినకుండా చూసుకోవాలి.

–వినయ్, వెటర్నరీ అసిస్టెంట్, మాగనూర్

ఇరుకుగా రహదారులు



ఇరుకుగా ముళ్లపొదలతో ఉన్న పెద్దకడ్మూర్, లక్కర్‌దొడ్డి రహదారి

నర్వ: రహదారులు అధికారుల పర్యవేక్షణ కరువై ఇరుకుగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో గ్రామాలకు వెళ్లేందుకు ప్రధానంగా 33 ఫీట్ల రహదారులను ఏర్పాటు చేస్తే, ప్రస్తుతం కొన్ని కుచించుకుపోతే, మరికొన్ని రవాణా లేక కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దకడ్మూర్ నుంచి లక్కర్‌దొడ్డి మీదుగా మండల కేంద్రానికి వెళ్లేందుకు కేవలం 5 కిలోమీటర్లు మాత్రమే ఉండేదని ప్రజలంటున్నారు. ఈ రహదారి కనీసం మట్టికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం పెద్దకడ్మూర్ నుంచి యాంకి మీదుగా 7 కిలోమీటర్లు మండల కేంద్రానికి వెలుతున్నామన్నారు. గతేడాది పెద్దకడ్మూర్ నుంచి లక్కర్‌దొడ్డి మార్గాన్ని కొద్దిదూరం ఉపాధి నిధులతో మట్టి వేశారన్నారు. ఈ మట్టిని పూర్తిగా లక్కర్‌దొడ్డి వరకు వేస్తే మండల కేంద్రానికి వెళ్లేందుకు తక్కువ సమయంలో వెళ్లేందుకు వీలుంటుదన్నారు. మట్టి వేయకపోవడంతో రహదారిని పక్క రైతులు దున్నడంతో పిల్లబాటగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేసి కనీసం మట్టిని వేసి హద్దులకు మొక్కలు నాటిస్తే రహదారులు భవిష్యత్ తరాలకు మిగిలిపోతాయని, లేకుంటే పూర్తిగా లేకుండా పోతాయని అంటున్నారు.